18వ వసంతం
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,23 జనవరి 2025


# ఆర్థిక సంఘం నిధులు విడుదలకై కృషి చేస్తా - ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలంలోని పంచాయతీ ఎన్నికలు జరగని ఆరు గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడానికి కృషి చేస్తానని కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ పేర్కొన్నారు. స్థానిక గుడారిగుంటలో ఎమ్మెల్యే కార్యాలయంలో రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కోరుతూ వినతి పత్రాన్ని ఎమ్మెల్యే నానాజీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 15వ ఆర్థిక సంఘం నిధులు మళ్లించడంతో గ్రామాలలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి కనీస వసతులు కరువయ్యాయని అన్నారు. కాకినాడ నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదన ఉన్న ఈ ఆరు గ్రామాలకు పంచాయతీ ఎన్నికలు జరగని కారణం చేత 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం నిలుపుదల చేసిందని అన్నారు. చట్ట ప్రకారం ఈ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన ప్రజాప్రతినిధుల తీర్మానాన్ని అనుసరించి విలీనం చేయాలా లేదా అనేది నిర్ణయించాల్సి ఉందని అన్నారు. ఈ గ్రామాలకు ఇంటి పన్నులే ఆదాయ వనరుగా ఉండి పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితి నెలకొంది అని అన్నారు. విలీనంపై కొందరు గ్రామస్తులు న్యాయస్థానంలో వ్యాజ్యంతో వేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ విషయాలను తీసుకువెళ్లి ఆర్థిక సంఘం నిధులు విడుదలకు కృషి చేస్తానని హామీని ఇచ్చారు. ఎమ్మెల్యే ని కలిసినవారిలో చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, రాజా, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, దాసరి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# కూటమి ప్రభుత్వం వల్లే నిర్వాసితులకు న్యాయం

**- ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి**

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :**పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం వల్లే న్యాయం జరుగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. ఇందుకూరుపేటలో ఆర్ అండ్ ఆర్ కాలనీ వాసుల ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ దంపతులు బుధవారం పాల్గొన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్ప శ్రీ, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ దేవీపట్నం మండలం ఇందుకూరుపేట ఎమ్మార్వో కార్యాలయంలో పోలవరం నిర్వాసితుల కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇటీవలే పోలవరం నిర్వాసితుల కుటుంబాలకు సుమారు 815 కోట్లు రూపాయలు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కింద విడుదల చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా దేవిపట్నం మండలంలోని తాళ్లూరు గ్రామానికి చెందిన మొత్తం 74 ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో గత ఐదు సంవత్సరాల నుంచి భర్తలు చనిపోయినటువంటి 33 మందికి ఇవ్వని ఇళ్ల పట్టాలను కూటమి ప్రభుత్వం వారందరికీ అందిస్తోందని తెలిపారు. ఈసందర్భంగా ప్రజలువారి సమస్యలు ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ దృష్టికి తెచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరిచెట్ల వెంకటేశ్వరరావు (బుజ్జిబాబు), బిజెపి పార్టీ అధ్యక్షులు కారం రామన్న దొర, జనసేన పార్టీ అధ్యక్షులు చారపు రాయుడు, సర్పంచ్ కుంజం రాజామణి, మాగాపు బాబురావు, గోళ్ళ చింటిబాబు, శివరామ కృష్ణ, గంగాధర్, నాగేశ్వరరావు, పోసమ్మ, నాగేశ్వరి, చిన్ని,కేశవరపు పండు, మల్లేష్, పండు అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





**అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం..** ఈనెల 20వ తేదీ సోమవారం అడ్డతీగలలోని వ్యవసాయ శాఖ కార్యాలయం పక్కన నివాసం ఉంటున్న పుడిగి మాణిక్యంకి చెందిన తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఈ విషయం కూటమి నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి విజయభాస్కర్ నిరాశ్రయులైన ఆ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా పదివేల రూపాయలతో పాటు నిత్యావసర వస్తువులు కూటమి నేతల ద్వారా బుధవారం అడ్డతీగల ఎమ్మార్వో, హౌసింగ్ డిఈ సమక్షంలో అందజేయడం జరిగింది. అంతేకాకుండా అధికారుల ద్వారా ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, నిరాశ్రయులైన కుటుంబానికి పక్కా గృహం మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బాలయోగి కుప్పాల జయరాం వీరలక్ష్మి బీరా వెంకట తదితరులు పాల్గొన్నారు. ఈ సమయంలో ఎమ్మార్వో దృష్టికి అడ్డతీగల గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ కష్టాల్లో ఆపదలో ఉన్నవారికి ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ దంపతులు తమ సొంత డబ్బులతో ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్న ప్రత్యర్థి పార్టీవారు ఎన్నో ఆరోపణలు చేస్తూ బురద చల్లుతున్నారని అయినా వాటిని లెక్కచేయకుండా నిరంతరంగా తమ సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే దంపతులకు కూటమి నేతలు బాధితులు తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.

## అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



**అల్లవరం,మేజర్‌న్యూస్ :** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం దేవగుప్తం గ్రామంనకు చెందిన బుంగా చిట్టిబాబు తాటాకు ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధం అయ్యి సర్వం కోల్పోయి కట్టుబట్టలతో నిరాశ్రలయ్యారు. చిట్టిబాబు కుటుంబంలో ఇద్దరు పిల్లలు దివ్యాంగులు ఉన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కోనసీమ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వంటెద్దు వెంకయ్య నాయుడు, అధ్యక్షులు నాగవరపు పరశు రాముడు ఆధ్వర్యంలో వెంకయ్యానాయుడు 5వేలు నగదు, నిత్యావసర వస్తువులు, డి.రావుల పాలెం బళ్ళ అర్జునరావు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడంతో కోనసీమ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు వెంకయ్యనాయుడు, అధ్యక్షులు నాగవరపు పర శురాముడు చేతుల మీద అగ్ని ప్రమాద బాధితులకు అందజేశారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని వెంకన్న నాయుడు కోరారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ సాధనాల వెంకట్రావు, ముత్తాబత్తుల రాం బాబు,పోతుల నాగరాజు,బ్యాంకు వీరబాబు, బొంతు శ్రీనివాస్, సాధనాల విగ్నేశ్వరరావు, పితానిసత్య ప్రసాద్, తిక్క బాబీ పాల్గొన్నారు.

## చింతూరు మండల కేంద్రంలో అనుమతి లేని భవన నిర్మాణాలను నిలుపుదల చేయాలి

**- ఆదివాసి సంక్షేమ పరిషత్**



**చింతూరు మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ చింతూరు మండల కేంద్రంలోని ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం చింతూరు ప్రాజెక్టు అధికారిని ఆదివాసి సంక్షేమ పరిషత్ బృందం ప్రజాదర్బార్‌లో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనం చిన్న వీరభద్రం మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు అప్పటి తాసిల్దార్ ఆదివాసుల ఐక్యతను మెచ్చుకొని సర్వేనెంబర్ 51/3లో 15 సెంట్లు ప్రభుత్వ భూమిని తమ సంఘానికి కేటాయించడం జరిగిందని ఆ భూమిని కొంత మంది గిరిజనేతరులు ఆదివాసులతో కలిసి భూమిని కొట్టేయాలని చూడడం దుర్మార్గమని. ఇట్టి భూమిని ఆక్రమించుకున్న వారిని, గ్రామ పంచాయతీలు అనుమతులు లేకుండా ప్రభుత్వం దేవాలయాలకు వివిధ సంస్థలకు స్కూలుకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన భూములపైన నిర్మాణాలు చేస్తున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సంఘానికి కేటాయించిన స్థలాన్ని సర్వే చేసి ప్రభుత్వ అధికారులు తమకు అప్పగించాలని ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చింతూరు ప్రధాన కార్యదర్శి సూర్య రాఘవయ్య, పోడియం లక్ష్మణ్ రావు, కుంజ శ్రీను, రవ్వ ప్రసాదు, అడవి కన్నారావు, మీడియం కొండయ్య, సోడే తమ్మయ్య, పూసం బుచ్చిరాజు, పాయం భద్రయ్య, మడివి కన్నారావు, పాయం మహేష్, రామకృష్ణ, ఇరకం శ్రీరామ్, మడివి రాజు, సవలం రాము తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి నదిలో అలివి వలలతో అక్రమ వేట





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** దేవీపట్నం మండలంలో గోదావరి నదిలో మరలా అలివి వలలతో వేట కొనసాగుతోంది. ఔషధ గుణాలు కలిగిన చిన్న చేపలతో లక్షల రూపాయల లాభార్జనతో అక్రమ వ్యాపారం జరుగుతోంది. అలివి వలలు, చిన్న కన్నుల వలలు, దోమతెరల వలలతో మత్స్య సంపద నిర్వీర్యం అవుతుంది. దేవీపట్నం మండలంలో గోదావరి నదిలో అలివి వలల వేట మళ్లీ మొదలైందని గిరిజన నిర్వాసిత మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా గోదావరి నదిలో అలివి వలలు, చిన్న కన్నుల వలలు, దోమ తెర వలలతో గోదావరిలో వేట జరుగుతుంది. సంబంధిత మత్స్యశాఖ అధికారులు కావాలనే పట్టించుకోవడం లేదా, లేక వారి కనుసన్నల్లోనే జరుగుతుందా అనేది తేలాల్సి ఉంది.గతంలో ధవలేశ్వరం, కొవ్వూరు, యానాం, నక్కపల్లి తదితర ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో మంతనాలు జరిపి లక్షల రూపాయలకు బేరం కుదుర్చుకోవడంతో సొమ్ము చేతులు మారినట్లు సమాచారం. ప్రస్తుతం ఇదే రీతిలో ఈ వ్యవహారం జరుగుతుందా? లేక రాజకీయ నాయకులు ఎవరైనా దీనివెనుక ఉన్నారా? అనేది సందేహంగా మారింది. గోదావరి నదిలో గిరిజన మత్స్యకార నిర్వాసితులకు చెందాల్సిన మత్స్య సంపదను బయట ప్రాంతాల వ్యక్తులు దోచుకుపోతుంటే అధికార యంత్రాంగం మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


## మీసేవ యాప్ ద్వారా 50 మంది పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు అందజేత



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని ఎర్రంపేటలో బుధవారం టిఎస్‌జిఆర్‌ఈఎ భవనంలో 2025-2026 ఆర్థిక సంవత్సరంకుగాను మీసేవ యాప్ ద్వారా బడే మియా అధ్యక్షతన 50 మంది పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా బడే మియా మాట్లాడుతూ సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు కు 15% క్వాంటం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఐటీ, ఈ-ఫైలింగ్ జూన్, జూలైలో ప్రతి సంవత్సరం చేయించుకోవాలని అన్నారు. ఫామ్ నెంబర్ 16 ఆధారంగా 2025 నుండి , 17 వాయిదాలలో మొదటి వాయిదాగా కలుస్తుందన్నారు. 4 డిఆర్ లని వెంటనే విడుదల చేయాలని, అదేవిధంగా పిఆర్‌సి ని వెంటనే విడుదల చేయాలని, పెన్షనర్లకు ఈ హెచ్‌ఎస్ ద్వారా నగదురహిత కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అమలయ్యే విధంగా చూడాలని, ఎంఆర్ బకాయిల్లో వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌జిఆర్‌ఈఎ భద్రాచలం అధ్యక్షుడు జి.భూషణ్ రావు, కార్యదర్శి జి.వెంకన్న, సహాయ అధ్యక్షుడు వై.రాము, చంద్రరావు, సత్యనారాయణ, నెట్ ఆపరేటర్ శివ పాల్గొన్నారు.

## కవి నూనె రమేష్ సాహితీ సేవలకు గుర్తింపుగా జాతీయ అవార్డు

**చింతూరు, మేజర్ న్యూస్ :** ప్రపంచంలోనే అతి పెద్ద




సాహిత్య సంస్థగా పేరొంది సాహిత్య చరిత్రలో ప్రభంజనం సృష్టిస్తున్న ఐ.యస్.ఓ గుర్తింపు పొందింది. తెలుగు భాష - తెలుగు సంస్కృతి తెలుగు వైభవం- తెలుగు సాహిత్యం - తెలుగు కళలు పరిరక్షణ కోసం నిరంతరాయంగా సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలతో దూసుకువెళ్తున్న శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో మన్యం కవి నూనె రమేష్‌కు సాహిత్య, సామాజిక రంగంలో చేస్తున్న సేవలనుగుర్తించి "జాతీయ యువతేజం" ప్రతిభా పురస్కారాన్ని రచయిత నూనె రమేష్ విజయవాడలో జరిగిన కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సిఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, అంతర్జాతీయ సమన్వయ కర్త కొల్లి రామావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, ఇతర జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. మూడు ప్రపంచ రికార్డ్ కవి సమ్మేళనాలలో పాల్గొని ప్రపంచ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకొని, పదుల సంఖ్యలో జాతీయ శతాదిక కవి సమ్మేళనాల పురస్కారాలు పొంది, ఐదు వందలకు పైగా సామాజిక ఇతివృత్తాలతో కవితలు వ్రాసి,రెండు తెలుగు రాష్ట్రాలే కాక ఇతర రాష్ట్రాలలో కూడా సాహితీ పురస్కారాలు పొంది అనతి కాలంలోనే జాతీయ అవార్డు గెలుచుకున్న కవి రమేష్‌ను గ్రామస్తులు, మండల ప్రముఖులు, స్నేహితులు అభినందించారు.

ఇంతటి ఘనత సాధించడం పట్ల నూనె రమేష్ తల్లిదండ్రులు నూనె అజరయ్య దంపతులు ఆనందం వ్యక్తం చేసారు.

# కాకినాడ కోనసీమ నడుమ ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేయాలి

**- పెనుగుదురు గురజనాపల్లి చొల్లంగి సాల్ట్ భూముల్లో ఏకమొత్తంగా వున్న 1,200 ఎకరాలు వినియోగించాలి**

**- పౌర సంక్షేమ సంఘం**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ కోనసీమ జిల్లాల నడుమ వున్న 1,200 ఎకరాల కేంద్ర ప్రభుత్వ సాల్ట్ భూముల్లో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పౌర సంక్షేమ సంఘం కోరింది. కోటిపల్లి యానాం రూటులో పెనుగుదురు వద్ద సర్వే నంబర్ 201/1,2,3,4 లో 566 ఎకరాలు, గురజనాపల్లి సర్వే నంబర్ 202లోచెందిన 560ఎకరాలు, చొల్లంగి పరిధి 70 ఎకరాలు ఏకమొత్తంగా వున్న 1,200 ఎకరాల సాల్ట్ భూములు అందుబాటులో ఉన్నాయన్నారు. కత్తిపూడి ఒంగోలు జాతీయ రహదారి 216 కి చేర్చి వున్నందున సముద్ర భూమికి 300ఎకరాల వైపున సాల్ట్ భూములు వున్నందున రోడ్ మార్గాలు డబుల్ లైన్ నుండి 4లైన్లు 6లైన్ల రహదారి గా మారుతున్నందున అధునాతన ట్రాఫిక్ సౌకర్యాలు తక్కువ ఖర్చుతో కాకినాడ కోనసీమజిల్లాల నడుమ 60కి మీ పరిధి లో విమానాశ్రయం అందుబాటులో వుండే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఇక్కడి సాల్ట్ భూముల్లో అనధికారికంగా అక్కడక్కడ చేపల చెరువుల నిర్వహణ తప్ప ఇతర ఆటంకాలు లేవన్నారు.కరప మండలం కాకినాడ రూరల్ పరిధిలో వున్నందున ప్రభుత్వం విమానాశ్రయం ఏర్పాటుకు పరిశీలన నిర్వహించాలని పౌర సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు కోరారు. నక్కపల్లి వద్ద విమానాశ్రయం ఏర్పాటు వలన భూములు సేకరించాల్సిన ఖర్చు భారం వుంటుందన్నారు. దగ్గరగా విశాఖ జిల్లా విమానాశ్రయం వుండగా అదనంగా చేర్చిన తీరుగా వుంటుందన్నారు. కాకినాడ జిల్లా కోనసీమ జిల్లాలకు విమానాశ్రయం లోటు లేకుండా రైతులకు ఇబ్బంది కలిగించే వ్యవసాయ భూములు సేకరించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వంపై భారం లేకుండా సాల్ట్ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రజోపయోగం చేసే అవకాశం వుంటుందని కేంద్ర రాష్ట్ర కూటమి ప్రభుత్వ నేతలకు సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డిప్యూటీ ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వ కామర్స్ మంత్రి పీయూష్ గోయల్, విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధ వహిస్తే సులభతరంగా పనులు పూర్తవుతాయన్నారు.

# పొగకు ఉత్పత్తులపైన నిషేదం విధించాలి - డా. అడ్డాల

కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సత్య దంత వైద్యశాలలో కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యాన పొగాకు ఉత్పత్తులు మరియు మాదక ద్రవ్యాల వాడకం వలన కలుగు దుష్ప్రభావాలపైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు మరియు మాదకద్రవ్యాలపైన ప్రభుత్వం నిషేధం విధించాలని విజ్ఞప్తి చేసారు. పొగాకు మరియు గంజాయి ఉత్పత్తుల వినియోగాన్ని నిలిపివేసిన తర్వాత మొదటి 12 గంటల్లో మన శరీరంలో ఆక్సిజన్ స్థాయిలు పెరుగుతాయని మరియు కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు తగ్గుతాయని అన్నారు. పొగాకు వినియోగానికి దూరంగా ఉంటే గుండెపోటును ఎదుర్కొనే ప్రమాదాన్ని తగ్గుతుందని తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ మరియు మూత్రాశయం, గొంతు, రక్తం, గర్భాశయం, కాలేయం, నోరు, ప్యాంక్రియాస్, పెద్దప్రేగు మరియు ఇతర క్యాన్సర్‌లతో సహా అనేక ప్రాణాంతక వ్యాధులు ధూమపానంతో సంబంధం కలిగి ఉంటాయని. ఈ రోజు ధూమపానం మానేయడాన్ని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి, విధ్వంసకర అలవాట్ల నుండి విముక్తి పొందేందుకు సంబంధాలను చక్కదిద్దుకోవడానికి మరియు స్వీయ శుభ్రత కోసం సమయాన్ని వెచ్చించడానికి ఒక మార్గంగా ప్రోత్సహిస్తుందని అన్నారు.కాకినాడ ఐడిఎ సిడిహెచ్ కన్వీనర్ డా. శ్రీవల్లి మాట్లాడుతూ ధూమపాన రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. మీ పెదవులపై సిగరెట్ కంటే చిరునవ్వు చాలా అందంగా కనిపిస్తుందని ఎల్లప్పుడు అందంగా జీవించాలని ప్రజలందరినీ కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఎ సభ్యులు డా. నాగేంద్ర, డా. సిరాజ్, డా. పద్మావతి ప్రజలు పాల్గొన్నారు.




# పాఠశాలల పునర్వవస్థీకరణ ప్రక్రియ కొరకు నివేదికలు సమర్పించాలి

**- క్లస్టర్ హెడ్ మాస్టర్లు, పర్యవేక్షక అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల పునర్వవస్థీకరణ ప్రక్రియ కొరకు ఖచ్చితమైన సమాచారంతో నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి క్లస్టర్ హెడ్ మాస్టర్లు, పర్యవేక్షక అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమీషనర్లు, యండిఓలు, యంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పాఠశాలల పునర్వవస్థీకరణ అంశంపై ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యను మరింత నాణ్యతగాను, పాఠశాలల నిర్వహణను సౌలభ్యవంతంగాను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పునర్వవస్థీకరణ చేపట్టిందని, ఇందుకు క్లస్టర్ల వారీగా ప్రస్తుతం నడుస్తున్న పాఠశాలలను వాస్తవంగా హాజరౌతున్న విద్యార్థుల వివరాలను యంఈఓలు, క్లస్టర్ హెడ్ మాస్టర్లు క్రోడీకరించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలలో కమీషనర్లు, మండలాల్లో యండిఓలు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు క్లస్టర్‌ల నుండి సమర్పించిన నివేదికలలోని సమాచారాన్ని రాండమ్‌గా తనిఖీ చేయాలని కలక్టర్ ఆదేశించారు. శనివారం ఈ అంశంపై మరో మారు సమీక్షించి, విద్యార్థుల సంఖ్య ఆధారంగా జిల్లాలో పాఠశాలల పునర్వవస్థీకరణ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించడం జరుగతుందన్నారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన, డిఈఓ పి.రమేష్, జడ్పి సిఈఓ వివిఎస్ లక్ష్మణరావు, ఆర్డిఓలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, హౌసింగ్ పిడి ఎన్.వివి.సత్యన్నారాయణ, డ్వామా పిడి పి.వెంకటలక్ష్మి, పిఓ-ఎస్‌ఎఎ, డివైఇఓలు, మున్సిపల్ కమీషనర్లు, యండిఓలు, యంఈఓలు, క్లస్టర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## టి.నీలిమకి జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు టి.నీలిమ సిద్ధాంత వ్యాసం 'ఏ స్టడీ ఆన్ ఫోస్టరింగ్ లాంగ్వేజ్ లెర్నింగ్ ఇన్ ఇంగ్లీష్ ఫర్ స్పెసిఫిక్ పర్పస్ (ఇఎస్‌పి) లెర్నర్స్-ఏన్ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈమెకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఇంగ్లీష్ విభాగంలో లభించినది. టి.నీలిమ తన సిద్ధాంత వ్యాసాన్ని తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని ఇఎఫ్‌ఎల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్‌లోని ఇఎల్‌టి విభాగాధిపతి డా.జి.సువర్ణ లక్ష్మి ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

## ఈనెల 31 నుంచి కాకినాడలో ఏపీ తైక్వాండో పోటీలు

### - పోస్టర్ ఆవిష్కరించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఈనెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ కాకినాడలోని జేఎన్టీయూకే ఇండోర్ స్టేడియంలో 1వ ఎన్టీఆర్ మెమోరియల్ ఏపీ స్టేట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2025 పోటీలు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా యూత్ తైక్వాండో అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సభ్యులు తిరుపతిలోని డీఎస్డీఓ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. అనంతరం యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యుల విజ్ఞప్తి మేరకు శాప్ ఛైర్మన్ రవినాయుడు చేతులు మీదుగా 1వ ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండో ఛాంపియన్షిప్ పోస్టరును ఆవిష్కరించారు.

# ఎస్సీ వర్గీకరణపై మాజీ కేంద్రమంత్రి ఆందోళన

కాకినాడ, మేజర్‌న్యూస్ : దళిత విభజన/ఎస్సీ వర్గీకరణపై మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది జాతీయ ఐక్యతకు పెనుముప్పుగా అభివర్ణించారు. స్థానిక హెూటల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణనంటూ జరిగితే మన భారతదేశం రెండు ముక్కలవుతుందన్నారు. రాబోయే 20 సంవత్సరాల్లో ఉత్తర భారతదేశం, దక్షిణ భారత దేశంగా అవతరించడం ఖాయమన్నారు. కారణం ఉత్తర భారతదేశంలో మాదిగలెక్కువగా వుంటారని, దక్షిణ భారతదేశంలో మాలలెక్కువగా ఉంటారని అన్నారు. దళిత విభజన వల్లే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలు ఏర్పాటైందన్నారు. మొన్న అక్కినేని నాగార్జున ఇల్లు కొట్టేస్తోంటే, నాకు అయో పాపం అనిపించిందన్నారు. మనసులో చాలా బాధపడ్డానని, ఈ గొడవంతా ఎందుకొచ్చింది చాలా మందికి తెల్వదన్నారు. దళితుల జోలికి పోబట్టే, రాష్ట్రం విడిపోయిందన్నారు. పిఠాపురం ఎమ్మెల్యే, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎస్సీ వర్గీకరణపై తన అభిప్రాయం తెలపాలని కాకినాడ నుంచి తానడుగుతున్నానని, వెంటనే జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ పుట్టుకతోనే, దళితులపై అసూయ పడ్డదని, ఒక్కటిగా కలిసివున్న మాల, మాదిగలను ఎలాగైనా వేరు చేయాలని కుట్రలు పన్నారని ఆరోపించారు. పర్వతనేని ఉపేంద్ర మాట్లాడిన మాటలు స్వయంగా నేనే విన్నానన్నారు. సుప్రీంకోర్ట్ 7 గురు



న్యాయమూర్తులు ఇచ్చింది ఆర్డర్ కాదు, అది డిజార్డర్ అని వ్యాఖ్యానించారు. 1994లో కాన్షిరాం ఏపీకి వచ్చి, 1700 మండలాల్లో తిరిగారని, ఎస్సీ, ఓబీసీలను కలపాలని, ఉత్తరప్రదేశ్ ఫార్ములా ఏపీలో సక్సెస్ చేయాలని ఆశించారన్నారు. కాన్షిరాం రాకతో కొంత మందికి కడుపు మండిందని, అప్పుడే వారి మనస్సులో మాల, మాదిగ విభజనకు బీజం పడ్డదన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు, దళిత విభజనకు పూనుకోవడం, విభజనవాదులను కొందరు ప్రోత్సహించాం న్నారు. యుపీ, తమిళనాడు, కేరళలో లేని ఎస్సీ వర్గీకరణపై ఏపీలో ఏకసభ్య కమీషన్ వేయడం తప్పన్నారు. దీని తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నానన్నారు. అమృతరావు సత్యాగ్రహం, రైతులు త్యాగాలు, ఎన్నో పోరాటాలు, ఎందరో బలిదానాలు, కాంగ్రెస్ పార్టీ, ఇందిరాగాంధీ కృషి వల్ల విశాఖ ఉక్కు వచ్చిందన్నారు. దీనిపై కార్పొరేట్ల కన్ను పడ్డదని, 25 వేల ఎకరాలు ఉక్కు భూములను అమ్మి, సొమ్ము చేసుకోవాలని అనుకున్నారన్నారు. "ఆకలిగా ఉన్నవాడి చేతికి అరటిపండు ఇచ్చినట్టు వుంది" కేంద్ర ప్రకటించిన 11 వేల కోట్లు సాయమని ఎద్దేవా చేశారు. ఉక్కు ఫ్యాక్టరీని ఐసీయూలోకి నెట్టింది తెలుగుదేశం ప్రభుత్వమేనని విమర్శించారు. ఐసీయూ నుంచి బయటపడ్డామని చంద్రబాబు నాయుడు మెడికల్ బాషలో చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. విశాఖ ఉక్కును సంపూర్ణ స్థితికి తెచ్చే బాధ్యత దావోస్‌లో పర్యటనలో వున్న చంద్రబాబుదేనని అన్నారు. బ్యాంకుల నుంచి ఒకాయన 45 వేల కోట్లు అప్పులు తెచ్చుకున్నాడని, అప్పు తిరిగి చెల్లించపోతే, ఎన్‌పిఎ లిస్ట్‌లో వెళ్లిందన్నారు. ఆ పెద్దమనిషి నుంచి కేవలం 450 కోట్లు మాత్రమే వసూలు చేసి, 40 వేల కోట్ల రూపాయలు పైగా రుణమాఫీ ఎలా చేస్తారు? ఏ పద్ధతి ప్రకారం రుణ మాఫీ చేశారని ప్రశ్నించారు. 40 వేల కోట్లు ఎగ్గొట్టినాయనకు మళ్ళీ, 10 వేల కోట్లు అప్పులు ఇచ్చేందుకు తయారవుతున్నారని విమర్శించారు. దేశ జనాభాలో 25 శాతం వున్న ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకులు ఇస్తున్న అప్పుల్లో 1 శాతం కూడా ఇవ్వడం లేదన్నారు.

## సమస్యల పరిష్కారానికి పెద్ద పీట

### - నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన నగరపాలక సంస్థ కమిషనర్ భావన



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ.. కాకినాడ నగరపాలక కమిషనర్ భావన బుధవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వస్తోన్న ఫిర్యాదులపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతున్నారు. దీనిలో భాగంగా నగరంలోని మూడో సర్కిల్, ఆరో వార్డులోని ఖాళీస్థలాన్ని పరిశీలించారు. చెత్త తో అధ్వానంగా ఉన్న ఆ ఖాళీస్థలాన్ని శుభ్రం చేసే పనులను పరిశీలించారు. ప్రైవేటు ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే తొమ్మిదో డివిజన్ కన్నయ్య కాపునగర్‌లో డ్రెయిన్ ధ్వంసమై మురుగునీరు రోడ్డుపైకి వస్తోందంటూ వచ్చిన ఫిర్యాదుపైనా కమిషనర్ భావన క్షేత్రస్థాయిలో పర్యటించారు. డ్రెయినేజీని పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సర్కిల్ స్పెషలాఫీసర్ టీపీఆర్వో శైలజకు సూచించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 30న ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2025

### - పారా అథ్లెటిక్ విభిన్న ప్రతిభావంతులు పేరు నమోదు చేసుకోవాలని వినతి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించుచున్న 7వ పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ జనవరి 30వ తేదీన గుంటూరు నందు జరగుచున్నదని వి.వి.వి.ఎస్.లక్ష్మణరావు, సంచాలకులు, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల మరియు వయోవృద్ధుల సంక్షేమశాఖ విజయవాడ వారు తెలియజేసియున్నారు. కావున ఫిబ్రవరి నెల 17 నుంచి 20 వరకు చెన్నైలో జరిగే జాతీయ పారాఅథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనడానికి ఆసక్తి గల పారా అథ్లెటిక్ విభిన్న ప్రతిభావంతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపిక చేయడం జరుగుచున్నదని, జిల్లా స్థాయిలో పారా అథ్లెటిక్ పాల్గొనేటట్లు తగు చర్యలు తీసుకోవలిసిందిగా తెలియజేసియున్నారు. కావున పారా అథ్లెటిక్ విభిన్న ప్రతిభావంతులు పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ లో పాల్గొనుటకు ఆసక్తి ఉన్నట్లయితే తమ పేర్లు నమోదు చేసుకొని పూర్తి వివరాలు తెలియజేయవలిసినదిగా తదుపరి ఇతర వివరములుకు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. 9390131777, 9652458901, 9182877433. ప్రతీ పారా అథ్లెటిక్ విభిన్న ప్రతిభావంతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలిసినదిగా కోరడమైనది.

## పారిశ్రామిక కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

### - డిప్యూటీ సీఎంకు మల్లాడి వినతి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ తీర ప్రాంతంలో పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి లేఖ రాశారు. పర్యావరణ ప్రేమికులుగా, పరిరక్షకులుగా మీరు తీసుకుంటున్న చర్యలకు సమాజం నుండి భారీ స్పందన వస్తుందన్నారు. కాకినాడ తీర ప్రాంతంలో ఉన్న పరిశ్రమలు తమ వ్యర్థాలను సముద్రంలోకి వదులుతుండటంతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, వ్యర్థాలను శుభ్రం చేసి, కాలుష్య నియంత్రణ నిబంధనల ప్రకారం నిర్ణీత ప్రదేశంలో వదిలివేస్తే తద్వారా మత్స్య సంపదకు ఇబ్బంది కలగదన్నారు. ఓఎన్ జీసీ, రిలయన్స్ కంపెనీల చమురు, గ్యాస్ నిక్షేపాల వెలికితీత వల్ల సముద్ర, నదీ జలాలు కలుషితమవుతు న్నాయని లేఖ ద్వారా వివరించారు. తీరప్రాంతం, గోదావరి పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని, ఈ కలుషిత వ్యర్థాల కారణంగా మృత్యువాత పడుతున్న అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రజలు కోరుతున్నట్టు తెలిపారు. ఈ విషయంపై క్షుణ్ణంగా విచారణ జరిపి, తక్షణ చర్య తీసుకోవాలని పవన్ కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు.

## లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ






కాకినాడ, మేజర్ న్యూస్ : లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు క్రీడలలో విజయపతాకాన్ని ఎగురవేశారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు జమ్ము కాశ్మీర్‌లో 17.01.25 నుండి 21.01.25 వరకు నిర్వహించిన 4వ సబ్ జూనియర్ కర్లింగ్ నేషనల్ క్రీడా పోటీలలో లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ నుండి పాల్గొన్న విద్యార్థులో నల్లమిల్లి శేషు రిషిత్ రెడ్డి (8వ తరగతి) అండర్-14 బాలుర విభాగంలో బంగారు పతకం మరియు జట్టు విభాగంలో కాంస్య పతకం, భీమన నాగేంద్రనాథ్ ఠాగూర్ (6వ తరగతి) అండర్-14 బాలుర జట్టు విభాగంలో బంగారు పతకం, భీమన శ్రీ దేదీప్య (5వ తరగతి) అండర్-14 జట్టు విభాగం లో వెండి పతకం మరియు మిక్స్ డబుల్స్ లో కాంస్య పతకం సాధించారు. లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ ఎన్. సుగుణా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వివిధ క్రీడలు ఆడడం ద్వారా శారీరక మానసిక ధారుఢ్యం కలిగి ఉంటారని తెలుపుతూ, పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులందరినీ అభినందించారు. ఆదిత్య సంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల లాభాలు చాలా ఉన్నాయి. కండబలంతో పాటు బుద్ధి బలం కూడా పెరుగుతుంది. క్రీడాకారులు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటారు. ఐకమత్యం, సంఘీభావం, చొరవ, నేర్పు, పట్టుదల, దీక్ష, కృషి, నాయకత్వ లక్షణాలు మొదలైన సుగుణాలు అబ్బుతాయి. అందుకే లక్ష్య పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు విద్యతోపాటు క్రీడలకు కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు . క్రీడల యందు ఆసక్తి గల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారని వారిని విజేతలుగా తీర్చిదిద్దడానికి అవసరమైన తర్ఫీదుని ప్రాథమిక స్థాయి విద్య నుండి ఇస్తున్నారని పేర్కొన్నారు. లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల ప్రిన్సిపాల్ వందన బోహ్రా మాట్లాడుతూ 19 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కర్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు జమ్ము కాశ్మీర్‌లో నిర్వహించిన ఈ పోటీలలో పాల్గొనగా, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము తరుపున లక్ష్య ఇంటర్నేషనల్ విద్యార్థులు పాల్గొని, ఛాంపియన్స్‌గా నిలిచారని తెలియజేశారు.

## ఫార్మశీ విద్యార్థులకు విశాఖపట్నంలోని సినర్జీన్ కంపెనీ వారు పూల్ క్యాంపస్ డ్రైవ్





కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో ది.22.01.2025 బుధవారం ఉదయం ఐఐఐపి&టి డైరెక్టరేట్ మరియు స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ & టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో అలూమ్ని ఆడిటోరియం నందు ఫార్మశీ విద్యార్థులకు విశాఖపట్నంలోని సినర్జీన్ కంపెనీ వారు పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ముందుగా సినర్జీన్ కంపెనీ ప్రతినిధులు ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణని విసి ఛాంబర్ నందు కలువగా ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు తమ డిగ్రీ పట్టాను అందుకున్న వెంటనే తగిన ఉద్యోగం పొందేలా వారికి తగిన తర్ఫీదునిస్తున్నామన్నారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను తగిన విధంగా ఉపయోగించుకుని పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపర్చుకుని తమ లక్ష్య సాధనకు ముందడుగు వేయాలన్నారు. అలాగే వారు రెక్టార్ ప్రొ. కె.వి.రమణను కలిసి సినర్జీన్ కంపెనీ ప్రొఫైల్‌ను వివరించి తాము చేపట్టే పూల్ క్యాంపస్ డ్రైవ్ వివరాలను తెలియజేశారు. ఈ పూల్ క్యాంపస్ డ్రైవ్‌లో విశాఖపట్నంలోని సినర్జీన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఐఐఐపిటి డైరెక్టర్ ప్రొ. బి.టి.కృష్ణ, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ & టెక్నాలజీస్ డైరెక్టర్ ప్రొ. కె.పద్మప్రియ తెలిపారు. జెఎన్‌టియుకె అనుబంధ కళాశాలల నుండి సుమారుగా 200 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 60మంది ఎంపికయ్యారన్నారు. పూల్ క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన విద్యార్థులకు స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ & టెక్నాలజీస్ విభాగాధిపతి డా.బి.భవానీ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ ఆఫీస్ వద్ద వ్రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్, సినర్జీన్ కంపెనీ సీనియర్ మేనేజర్ రవిశర్మ, హెచ్‌ఆర్ మేనేజర్ రవితేజ, ఎగ్జిక్యూటివ్ హెచ్‌ఆర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఒక మండలం ఒక గ్రామం రీ సర్వే పనులు ప్రారంభం


### - ఇప్పటికే క్షేత్ర స్థాయిలో గ్రామ సభల నిర్వహణ
### - పొడగట్లపల్లి గ్రామంలో ఎనిమిది బృందాలతో రీ సర్వే



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం మండల కార్యాలయం రీ సర్వే పై బుధవారం స్థానిక అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేసి, గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు గ్రామ కంఠం, రైతు, భూ యజమాని వారీగా ప్రవేటు భూముల గుర్తింపు, మ్యాపింగ్ విధానం పారదర్శకతతో రూపొందించాలని కొత్తపేట డివిజన్ రెవిన్యూ అధికారి పోలపల్లి శ్రీకర్ తెలిపారు. రీ సర్వే గ్రామాల్లో గ్రామ సభ, అవసరం ఐతే బహిరంగ సభలు నిర్వహించి ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా భూముల రికార్డులు రూపొందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే వీటన్నిటిపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా రికార్డులను సరిచేయాలన్నారు. జిల్లాలో ప్రతి మండలం నుంచి ఒక గ్రామం చొప్పున రీసర్వే పనులు చేపట్టడం జరుగుతున్నట్లు తెలిపారు. అన్ని రకాల భూసమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించాలన్నారు. రీసర్వేతో నష్టపోయినట్లు రైతులెవరైనా ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వేలో జరిగిన పొరపాట్లను గ్రామసభల ద్వారా సరిచేయాలన్నారు.


ముందుగా గ్రామంలో ప్రచారం చేసి, తహసీల్దార్, మండల సర్వేయర్, గ్రామస్థాయి సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. తొలుత గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు ముందుగా చేపట్టాల్సి ఉందన్నారు. తదుపరి ప్రవేటు వ్యక్తుల భూములు గ్రౌండ్ ట్రూథింగ్, విస్తీర్ణం, రైతు వివరాలు, ప్రస్తుత భూయజమాని, సర్వే, సెటిల్మెంట్ టైటిల్ డీడ్ వంటివి నిర్ధారణ చేయాలన్నారు. ఎక్సటెంట్ సరిచూసుకోవాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణ జరగకుండా చూడాలని, చెరువులు, తదితర భూములను గుర్తించాలన్నారు. ఆర్ ఎస్ ఆర్, వన్ బి, రీ సర్వే రికార్డులు ఒకేలా ఉండాలనీ, ఈ విషయంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. ఈ సభలో తసీల్దార్ ముక్తేశ్వరరావు, డిప్యూటీ తసీల్దార్ శ్రీనివాస్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సుజాత, సర్వేయరులు, గ్రామ రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ క్యాంటీన్ ప్రారంభం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో బుధవారం సాయంత్రం టీచింగ్, నాన్ టీచింగ్ మరియు విద్యార్థుల సౌకర్యార్థం యుసిఇకె కాలేజీ నందు ప్రిన్సిపాల్ ఆఫీస్ ఎదురుగా ఏర్పాటుచేసిన గ్రీన్ క్యాంటీన్‌ను ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి. మురళీకృష్ణ ప్రారంభించారు. యుసిఇకె ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేయగా రెక్టార్ ప్రొ.కెవి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి.రవీంద్రనాధ్‌లు అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ మాట్లాడుతూ క్యాంటీన్ ఏర్పాటుచేయడం వలన టీచింగ్, నాన్ టీచింగ్ మరియు విద్యార్థులకు అల్పాహారం, భోజన వసతి సదుపాయాలు అందు బాటులో ఉంటాయన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చేవారికి ఈ క్యాంటీన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. క్యాంటీన్ సదుపాయాన్ని విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు ప్రొ. వి.రవీంద్ర, ప్రొ. బి.బాలకృష్ణ, ప్రొ. జి.ఏసురత్నం, ప్రొ. ఎం.హెచ్.ఎం.కృష్ణప్రసాద్, ప్రొ. బి.టి.కృష్ణ, మాజీ ఉపకులపతి ప్రొ. జి.వి.ఆర్.ప్రసాదరాజు, విభాగాధిపతులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న హుండీ ఆదాయం రూ.1 కోటి 20 లక్షలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 40 రోజుల కాలానికి రూ. 1,20,88,369లు, బంగారం 19 గ్రాములు, వెండి 890 గ్రాములు సమకూరింది. క్షేత్రపాలకుడు విశ్వేశ్వర స్వామివారి హుండి ఆదాయం రూ. 7.4,22,210లు సమకూరింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు, తనిఖీ అధికారి టీ.వీ.ఎస్.ఆర్. ప్రసాద్, ఈవోలు ఎన్.వి.ఎన్.ఎస్.వి.ప్రసాద్ రాజు, బి.కిరణ్, జిల్లా ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షులు, దేవస్థాన మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఉప సర్పంచ్ బాబురావు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలపై ప్రాంతాల పరిశీలన





కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ నగరంలో నిర్వహించు పలు అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్‌తో శాసనసభ్యులు వనమాడి కొండబాబు కలిసి దుమ్ములపేట, పర్లవపేట, ఏటిమోగ తదితర ప్రాంతాలను పరిశీలించారు.

గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో దుమ్ములపేట ప్రాంతం నందు పేద వర్గాలకు అందించిన పట్టాల భూములను మరియు కాకినాడ నుండి ఏటిమొగ మీదుగా గురజనాపల్లి వరకు నిర్మించు మూడవ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదన ప్రాంతాన్ని మరియు జగన్నాధపురం ఎంఎస్ఎన్ చారిటిస్ నందు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతిపాదన తయారుచేసి నిధులు మంజూరు చేసిన ఎంఎస్ఎన్ స్టేడియం ప్రాంతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రేవిన్యూ డివిజన్ అధికారి మల్లిబాబు, కాకినాడ అర్బన్ మండల అధికారి జితేంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ సహాయ నటుడుగా కేదారి నాగు



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలం, తాటిపర్తి గ్రామానికి చెందిన ప్రజానాట్యమండలి నాయకుడు కేదారి నాగుకు 'జనరల్ బోగీలు' నాటికలో ఉత్తమ సహాయ నటుడుగా బహుమతి అందుకున్నారు. బాపట్ల జిల్లా అనంతవరంలో జరిగిన రాష్ట్రస్థాయి తృతీయ ఎన్‌టిఆర్ నాటక పరిషత్ పోటీలలో ఈ బహుమతి కేదారి నాగు అందుకోవడం జరిగింది. కొలుకలూరి వారి సాయి ఆర్ట్స్ నాటక సమాజంలో పి.టి.మాధవ్ రచనలో గోపరాజు విజయ్ దర్శకత్వంలో నాటక ప్రదర్శన జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన నాటికల పోటీలలో 9 నాటికలు పోటీపడగా, ఉత్తమ సహాయ నటుడుగా నాగు గెలుపొందడం అభినందనీయమని, స్నేహ ఆర్ట్స్ అధ్యక్షులు గొందేశి రాజా, ప్రజానాట్యమండలి నాయకులు రొంగల వీర్రాజు, డి.కృష్ణ, సత్యనారాయణ, రాంబాబు, మంతెన సత్తిబాబు, అభినందనలు తెలిపారు. నాగు మరిన్ని బహుమతులు గెలుచుకోవాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## మడికి సచివాలయ కార్యదర్శికి గ్రేడ్-4 పదోన్నతి



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రామ సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శిలకు గ్రామ పంచాయతీ గ్రేడ్ -4 కార్యదర్శులుగా పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఆలమూరు మండలంకు సంబంధించి మడికి సచివాలయ-2 కార్యదర్శి షేక్ మహమ్మద్ అలీ ఈ పదోన్నతిని పొందారు. మండలంలో ఎనిమిది మంది సచి వాలయ గ్రేడ్ 5 కార్యదర్శిలు ఉండగా అందులో ఆలీ ఒకరికే ఈ పదోన్నతి లభించింది. ఈయనకు కౌన్సిలింగ్ ద్వారా గ్రేడ్ -4 గ్రామపంచాయతీలో కార్యదర్శిగా నియమిస్తారు.

# రహదారి ప్రమాదాల నివారణకు విశ్లేషణ సరైన మార్గం

**- జాతీయ రహదారులు పై లైటింగ్ వ్యవస్థ పటిష్ఠం కావాల్సి ఉంది**
**- కలక్టర్ పి.ప్రశాంతి**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో, అక్కడ తీసుకున్న పరిష్కార మార్గాలు పై అనాలసిస్ చెయ్యాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవం -2025 సందర్భంగా జిల్లా రహదారుల భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో గోల్డెన్ అవర్ లో తీసుకున్న చర్యలను సమీక్షించడం జరిగిన వాటిపై అధ్యయనం చెయ్యాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి అధ్యాయనాన్ని ఆర్ట్స్ కళాశాల అధ్వర్యంలో కేసుల వారీగా విశ్లేషణ చెయ్యాలని పేర్కొన్నారు. జాతీయ రహదారులు, ట్రాఫిక్ వారీగా, డి ఎమ్ హెచ్ వో ల ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం ముఖ్యం



అన్నారు. రద్దీ సమయాల్లో ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ మళ్లింపు పై దృష్టికేంద్రీకరించాలని పేర్కొన్నారు. పోలీసు, జిల్లా యంత్రాంగం సూచించిన 27 బ్లాక్ స్పాట్స్ ప్రాంతాలలో, 16 ప్రమాద కరమైన రహదారులు,11 జంక్షన్ ప్రాంతాల్లో లైట్నింగ్, క్యాట్ ఐస్, ట్రంబుల్స్ స్ట్రిప్స్, రబ్బర్ స్ట్రిప్స్ ను జాతీయ రహదారులు అధ్వర్యంలో ఏర్పాటు చెయ్యాలని పేర్కొన్నారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి పరిహారం అందజేయాల్సి ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా ఐ ఆర్ ఎ డి (ఐరాడ్ - ఇంటిగ్రేటెడ్ రోడ్డు ప్రమాద డేటా) డేటా ఎంట్రీ నమోదు చేయడంలో సమన్వయ శాఖల అధికారులు ఖచ్చితంగా విధులను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారులు పై లైటింగ్ వ్యవస్థ పటిష్ఠం కావాల్సి ఉంది ఆమేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ప్రతిపాదనలు సిఫార్సు చెయ్యాలని సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, అదనపు ఎస్పీ ఏ వి సుబ్బ రాజు, జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్, ఎన్ హెచ్ అధికారి సల్మాన్ శారీ, డిఎస్పీ వెంకటేశ్వర రావు, పోలీస్, మెడికల్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్వర్‌లు పనిచేయక స్తంభించిన రిజిస్ట్రేషన్



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** కొవ్వూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సర్వర్‌లు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్తంభించింది. మంగళవారం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు సర్వర్ లు పని చేయకపోవడంతో తిరిగి వెళ్లి బుధవారం మరల కార్యాలయానికి చేరుకొగా అదే పరిస్థితి నెలకొనడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పడికాపులు కాశారు. తిరిగి సాయంత్రానికి సర్వర్‌లు పనిచేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి రిజిస్ట్రేషన్ వేల్యూలు పెంచుతామని ప్రకటించడంతో ప్రజలు తమ ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవడం కోసం రిజిస్టర్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. రానున్న రోజుల్లో సర్వర్ లు పనిచేస్తాయో లేదో అంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 53,017 ఎకరాలకు ఏలేరు జలాలు విడుదల...



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** రబీ పంటకు ఏలేరు ప్రాజెక్టు నుంచి 53,017 ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నట్లు సామర్లకోట ఇరిగేషన్ డీఈ ఆకెళ్ళ రవికుమార్ తెలిపారు. సామర్లకోట ఏలేరు కాలువ పరిధిలో రబీవరిపొలాలను డిఇ రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టు నుంచి 1400 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా దానిలో 200 క్యూసెక్కుల నీటిని విశాఖ స్టీల్ ప్లాంట్కు ఇస్తున్నామన్నారు. మిగిలిన 1200 క్యూసెక్కులు రబీ వరిసాగుకు కేటాయించినట్లు తెలిపారు.

అలాగే ప్రస్తుతం రబీ సాగుకు ఎక్కడా సాగునీటి ఎద్దడి లేదని, ప్రస్తుతం జలాల విడుదల ద్వారా ఎద్దడి కలగకుండా చర్యలు చేపడుతున్నట్టు డిఇ రవికుమార్ తెలిపారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 25న జాతీయ ఓటర్ల దినోత్సవం

**- ర్యాలీ, ప్రతిజ్ఞ, సీనియర్ ఓటర్లకు సన్మానం - ఈఆర్వో మరియు ఆర్డీఓ కె.శ్రీరమణి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 25వ తేదిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని 201 పోలింగ్ బూత్‌ల వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించబడునని, పెద్దాపురం నియోజకవర్గ ఈఆర్వో మరియు ఆర్డీఓ కె.శ్రీరమణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ప్రతిజ్ఞ నిర్వహించడంతో పాటు, మహిళా శక్తి సంఘాలు, డ్వాక్రా మహిళలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందని, అలాగే ఓటు హక్కు యొక్క ప్రాధాన్యత వివరించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అనంతరం ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని, దీనిలో భాగంగా పెద్దాపురం మహారాణి కళాశాల వద్ద ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించి, అనంతరం కాలేజి నుండి మెయిన్‌రోడ్ మీదుగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో కొత్త ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు అందజేయడంతో పాటు సీనియర్ ఓటర్లను సన్మానించడం జరుగుతుందని, ఈఆర్వో కె.శ్రీరమణి పేర్కొన్నారు.

## భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**- ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి**



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, సమర్థవంతమైన కార్యకర్తల ద్వారానే పార్టీ మరింత బలోపేతం అవుతుందని పొత్తు ధర్మం నిర్వహిస్తూ ప్రభుత్వం ప్రజల ముందుకు సాగాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్ టి.మాలతీ రాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన తూర్పుగోదావరి జిల్లా పార్లమెంట్ బిజెపి అధ్యక్షుని నియామకం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీపీసీ తరపున ఒక లక్షా 20వేల కోట్ల రూపాయలను విశాఖ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని, అలాగే పోలవరానికి 13,500కోట్లు, అమరావతి నిర్మాణానికి 26000 కోట్లు, పంచాయతీల అభివృద్ధికి 4800కోట్లు మంజూరు చేసిన ఘనత భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. వర్గ విభేదాలు లేకుండా సంస్థగత బలం, కార్యాచరణ బలం రెండు కళ్ళుగా చేసుకొని ఏకతాటిపై నడవాలని, భారతీయ జనతాపార్టీ కుటుంబ సభ్యులుగా అంకితభావంతో పని చెయ్యాలన్నారు. అనంతరం భారతీయ జనతా పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షునిగా పిక్కి నాగేంద్ర కు నియామక పత్రం అందజేసి అధ్యక్షునిగా ప్రకటించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఇన్చార్జి మధుకర్ జి, జాతీయ బిజెపి కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు సూర్యనారాయణ రాజు, మాజీ జిల్లా అధ్యక్షులు బొమ్మల దత్తు,అడబాల రామకృష్ణ, రేలంగి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## దొంగలు బాబోయ్ దొంగలు..



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ప్రశాంతంగా ఉన్న కొవ్వూరు పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.ఒకే రోడ్డులో నిమిషాల వ్యవధిలో ఇద్దరు మహిళలు మెడలోంచి గుర్తు తెలియని దుండగులు బైక్ పై వచ్చి బంగారు గొలుసులు లాక్కెళ్ళిన సంఘటన జరగడంతో ఒక్కసారిగా ప్రజలు భయాందోళన గురయ్యారు.వివరాల్లోకి వెళితే కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన నక్క ధనలక్ష్మి బ్యాంకు పని నిమిత్తం కొవ్వూరు రాగా బ్యాంకు కాస్త సమీపంలోనే దుండగులు బైక్ పై వచ్చి ధనలక్ష్మి మెడలో ఉన్న మూడున్నర కాసులు బంగారు గొలుసు లాక్కెల్లారు. అదే రోడ్లో కొవ్వూరు పట్టణానికి చెందిన బర్ల లలిత అపర్ణ దేవి అంగన్వాడి టీచరుగా పనిచేస్తుంది. జిరాక్స్ కాపీల కోసం కాలేజ్ రోడ్ లో నుంచి నడిచి వెళుతుండగా పంచాయతీరాజ్ కార్యాలయం సమీపంలో బైక్ పై వచ్చిన దుండగులు లలిత అపర్ణ దేవి మెడలో నుంచి ఐదు కాసుల చైన్, కాసున్నర నల్లపూసల చైన్ లాక్కెళ్ళినట్లు బాధితులు కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.విశ్వం సంఘటన స్థలానికి చేరుకొని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.దొంగతనం జరిగిన ప్రాంతాలలో సీసీ కెమెరాలను గుర్తించి సిసి ఫుటేజీల ద్వారా నిందితుల గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ విశ్వం మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సిసి పుటేజలను పరిశీలించడం జరుగుతుందని తద్వారా నిందితులను తొందర్లోనే పట్టుకోవడం జరుగుతుందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కావమ్మ ఆలయం వద్ద భారీ అన్నదానం...



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట కావమ్మ పేరంటాలి ఆలయం వద్ద బుధవారం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సామర్లకోట ఏలేరు, గోదావరి కాలువల మధ్యఉన్న కావమ్మ పేరంటాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించ్చారు.ఈ కార్యక్రమాన్ని పట్టణ తెదేపా అధ్యక్షులు అడబాల కుమార స్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బదుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు, శెట్టి బత్తుల దుర్గారావు , పార్టీ క్రీడా కన్వీనర్ నిమ్మకాయల కిరణ్ కుమార్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా సుమారు 5 వేల మంది భక్తులు కావమ్మ అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన అన్నదానంలో ఆలయ కమిటీ నాయకులు సుఖపట్ల బాబ్జి, సుఖపట్ల మరి బాబు, దువ్వ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ సెంటర్ అభివృద్ధికి సహకరిస్తా

**- ఆలమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు**



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** ఆలమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి సహకరిస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.ఈరోజు ఆలమూరు గ్రామంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు,జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు.ముందుగా ఆసుపత్రిని పరిశీలించిన సత్యానందరావు రోగులను పరామర్శించి అందే వైద్య సాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యం సేవల కోసం గైనకాలజిస్టు అవసరమని ఎమ్మెల్యేను కోరడంతో తక్షణమే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే ఆసుపత్రికి అవసమైన మందులు కొనుగోలు చేయాలని,కంప్యూటర్ సిస్టం,ఫైల్స్ భద్రత కోసం బీరువాలు, ఇన్వర్టర్ కు బాటరీ వంటి పరికరాల కోసం సమావేశంలో పెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు.వాటి పూర్తి చేసే భాద్యత అభివృద్ధి కమిటీ చూసుకోవాలని సత్యానందరావు సూచించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనవరి 26 గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

**- ఆర్ట్స్ కళాశాలలో పేరెడ్ రిహార్సిల్స్ పర్యవేక్షణ**
**- వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా స్టాల్స్ ఏర్పాటు, శకటాల ప్రదర్శన - జెసి చిన్నరాముడు**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే క్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రాంగణాన్ని ఏర్పాట్లు చెయ్యడం జరుగుతోందను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు కలక్టర్ వారి ఆదేశాల మేరకు ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌ను అధికారులతో కలిసి పరిశీలించినట్టు చెప్పారు. జిల్లా కలెక్టరు ముఖ్య అతిథిగా జాతీయ జెండా ఎగురవేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వేడుకలకు వచ్చే అతిథులు సభావేదిక, తదితర ఏర్పాట్లను పరిశీలించామన్నారు. స్టేజ్ ఏర్పాటు బారికేడింగ్, వేడుకలు తిలకించేందుకు వచ్చే విద్యార్థులకు గ్యాలరీల ఏర్పాటుపై చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు వేడుకలు నిర్వహించే క్రమంలో, ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ అభివద్ధి కార్యక్రమాల సమాహారంగా శాఖలు శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా, స్టేజి నిర్మాణం పై అధికారులకి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేసారు.

సభా ప్రాంగణంలో ప్రత్యేక మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కతిక కార్యాక్రమాల కోసం వివిధ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులు జాతీయ స్ఫూర్తిని నింపే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మురళీ కృష్ణ, ఇతర జిల్లా అధికారులు నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పథకాల అమలు రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి సోషల్ ఆడిట్ టీమ్



సామర్లకోట, మేజర్ న్యూస్ : ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసేందుకు, ప్రభుత్వ స్కీమ్‌లు అందరికీ ఏ విధంగా అందుతున్నాయని తెలుసుకొనేందుకు సోషల్ ఆడిట్ ను స్థానిక పి ఎం శ్రీ మున్సిపల్ హైస్కూల్ అయోధ్యరామపురం లో బుధవారం చేపట్టి సంతృప్తి వ్యక్తం చేశారు.సామాజిక తనిఖీ లో భాగంగా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ తోను పేరెంట్స్ తో ను,విద్యార్థులతో అభిప్రాయ సేకరణ సోషల్ ఆడిట్ అధికారి కే హరి ఆధ్వర్యం లో నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు, రికార్డు ల నిర్వహణ,పాఠశాల పరిశుభ్రత,మరుగు దొడ్ల నిర్వహణ,వివిధ రిజిస్టర్ల నిర్వహణను తనిఖీ చేశారు. ఆర్ ఓ ప్లాంట్, తరగతిగది నిర్వహణ,క్రీడా పరికరాలు తదితర అంశాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ,స్కూల్ మేనేజ్మెంట్ చైర్మన్ అక్కిన చక్రధర్,సభ్యులు భారతి సుజాత, దేవి వెంకట లక్ష్మి తదితరులు టీచర్లు పేరెంట్స్ పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలి

**- కొత్తూరు సెంటర్ హైస్కూల్‌లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు**
**- రాష్ట్రంలో మొదటగా ఆలమూరు నుండి ఈ కార్యక్రమం ప్రారంభించడం ఆనందంగా ఉందన్న ఎమ్మెల్యే**



**ఆలమూరు,మేజర్‌న్యూస్ :** పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్ ప్రభుత్వ హైస్కూల్ లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ అధినేత కృష్ణ పాడిశెట్టి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్,బండారు సంజీవ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రైట్ చైల్డ్ పౌండేషన్ యాజమాన్యాన్ని అభినందిస్తూ రాష్ట్రం మొత్తం జరుగనున్న ఈ కార్యక్రమం మొదటగా ఆలమూరు నుండి ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు.అభివృద్ధి అంతా టెక్నాలజీ పైనే ఆధారపడి ఉందని అంచేత అందరూ కంప్యూటర్ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.నాడు చంద్రబాబు నాయుడు బీజం పోసిన హైటెక్ సిటీ నేడు హైదరాబాదును ప్రపంచ పటంలో నిలబెట్టిందని గుర్తు చేశారు.విభజిత రాష్ట్రంలో 2014 - 19 మధ్య కూడా విశాఖను సాఫ్ట్వేర్ రంగంలో అభివృద్ధి కృషి చేరని గుర్తు చేసి మరలా నేడు అధికారంలోకి రాగానే విశాఖను ఐటీ రంగంలో అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరిగిందన్నారు.భవిష్యత్తు తరాలు అంతా సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడి ఉండటంతో ప్రభుత్వం కూడా అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేస్తోందని సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం

**- అఖిల భారత యువజన సమాఖ్య 22వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి**
**- 22వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 6-9 తేదీలలో శ్రీకాకుళంలో జరుగుతున్న అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర 22వ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు కోరారు. కాకినాడలో రాష్ట్ర మహాసభలు వాల్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నిరుద్యోగ భృతి ఇవ్వక పోవడం, ఎన్నికల హామీలను అమలు చేయడంలో కుటమి ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. ఫిబ్రవరి 6 నుండి 9 వరకు శ్రీకాకుళంలో జరిగే మహాసభ ప్రారంభ సందర్భంగా ఫిబ్రవరి 6న 26 జిల్లాల నుండి వేలాది మంది యువకులతో యువజన ప్రదర్శన, బహిరంగ సభ 7,8,9 తేదీల్లో జరిగే ప్రతినిధుల సభలో 600 మంది యువజన ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. 22వ రాష్ట్ర మహాసభల్లో సమగ్ర యువజన విధానం, నూతన పరిశ్రమల ఏర్పాటు, స్థానిక యువతకు ఉపాధి, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణ, ప్రవేటీకరణకు వ్యతిరేకంగా, విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి నిధులు, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక నిధులు, ప్రవేటీకరణ రిజర్వేషన్, నిధులు, రాజధాని ప్రాంతాన్ని ఫ్రీజోన్ చెసి ఉద్యోగ అవకాశాలు 26 జిల్లాల నుండి నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని, రాజధాని, పోలవరం నిర్మణానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు సమీకరించాలని, మతోన్మాదంకు వ్యతిరేకంగా, రాజ్యాంగ పరిరక్షణ, కార్పొరేట్ వ్యక్తుల నల్ల ధనం పునః పంపిణి చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీని వివిధ అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రుపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మానెడ్డి వీరబాబు, మైఖేల్, మహేష్, బత్తుల జీవన్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



## ఏకలవ్య పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన డిడి

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రాజవొమ్మంగి ఏకలవ్య మోడల్ పాఠశాలను ట్రైబల్ వెల్ఫేర్ డిడి విజయశాంతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.మధ్యాహ్నం విద్యార్థులకు తయారు చేసిన( మెనూ)ఆహార పదార్థాలను పరిశీలించారు.

విద్యార్థులను ఎలా చదువుతున్నది అడిగి తెలుసుకున్నారు. 10 తరగతివిద్యార్థులు చక్కగా చదువుకొని మెరిట్ సాధించాలన్నారు. అలానే ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులను చదివించాలన్నారు. డిడి వెంట ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## దొంగతనాల నివారణలో దేవాలయాల నిర్వాహకులు సహకరించాలి



**– సిఐ పి.విశ్వం**

**కొవ్వూరు,మేజర్‌న్యూస్ :** దొంగతనాలు నివారించడంలో దేవాలయాల నిర్వాహకులు తమ సహాయ సహకారాలు అందించాలని పట్టణ సీఐ పీ.విశ్వంకోరారు.బుధవారం సాయంత్రం గోష్పద క్షేత్రంలో ఆలయాల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సిఐ విశ్వం మాట్లాడుతూ కొవ్వూరు పట్టణ సర్కిల్ పరిధిలో దొంగతనాలు అరికట్టేందుకు దేవాలయాలు, చర్చిలు, మసీదులలో తప్పనిసరిగా ఆలయ నిర్వహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వాటితో పాటు గృహ యజమానులు కూడా తమ ఇంటి పరిధిలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దేవాలయాల వద్ద తెలియని వ్యక్తులు సంచరించిన ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు చేపట్టిన డయల్ 112 కు కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కే.జగన్ మోహన్, సచివాలయ మహిళా కానిస్టేబుల్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

# అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలి

**– కలెక్టర్ షణ్మోహన్**

**జగ్గంపేట, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయి అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి, జగ్గంపేట మండలాల్లో పర్యటించి ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. తొలుత కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ అధికారితో కలిసి సందర్శించారు. ఆస్పత్రి ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, మరుగుదొడ్ల శుభ్రత, నిర్మాణ దశలో ఉన్న అదనపు భవనం పనులను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అనంతరం బూరుగుపూడి గ్రామంలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని (ఎస్డబ్ల్యూపీసీ) పరిశీలించారు. గ్రామంలోని జనాభా, ఇంటింట చెత్త సేకరణ, పారిశుధ్య కార్యక్రమాలు అమలు, వర్మీ కంపోస్ట్ తయారీ, రైతులకు పంపిణీ వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలోని లబ్ధిదారుడు దాడి వెంకటేశ్వరరావు నిర్మించుకున్న గోకులం షెడ్డును పరిశీలించి



రైతుతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా కాండ్రేగుల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సమగ్ర చిన్న నీటిపారుదల పునరుద్ధరణ పనులు చేపట్టిన సోమన్న చెరువును గ్రామస్తులతో పాటు పరిశీలించారు. 4.3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సోమన్న చెరువు పూడిక పనులు సక్రమంగా పూర్తి చేయాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాని సంబంధించి నిర్దేశించిన పని దినాల సంఖ్య అనుగుణంగా చెరువు పూడిక పనుల్లో పురోగతి చూపించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం జగ్గంపేటలోని పశుసంవర్ధక శాఖ ఆసుపత్రిని పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణంలో పరిశుభ్రతపై అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులలో ప్రగతి కనబరచాలన్నారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయి అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యాధికారులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కిర్లంపూడి, జగ్గంపేట మండలాల ఎంపీడీవోలు బి.హరికృష్ణ, ఎ.చంద్రశేఖర్, కిర్లంపూడి, జగ్గంపేట తహసీల్దార్లు పీ.చిరంజీవి, జేవిఆర్. రమేష్, ప్రత్తిపాడు ఏపీడి ఎం.భానుప్రకాష్, డిప్యూటీ డిఎంహెచ్వో డా.సరిత ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేసిన జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి



**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశించారు. నియోజకవర్గంలోని కిర్లంపూడి, జగ్గంపేట మండలాల్లో ఆయన బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. కిర్లంపూడి మండలంలో కిర్లంపూడి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని బూరుగుపూడిలో సచివాలయాన్ని, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం జగ్గంపేట మండలంలోని మామిడాడలో గోకులం షెడ్డు ను సందర్శించారు. రైతులతో ముచ్చటించారు. తదుపరి కాండ్రేగులలో ఉపాధి హామీ పథకంలో పనిచేసిన చెరువును పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాలను తనిఖీ చేసి ఆసుపత్రి అవరణంలోనూ, ప్రక్కనే విద్యా శాఖ కార్యాలయంలోను చెత్త ఉండటంపై వెటర్నరీ ఏడి తాతయ్య, ఎంపిడిఓ ఏవిఎస్ చంద్రశేఖర్ పై మండిపడ్డారు. గత శనివారం పరిసరాలను ఎందుకు శుభ్రపరచలేదని ప్రశ్నించారు. వెటర్నరీ సిబ్బంది 12 మందితో పరిసరాలను శుభ్రపరచాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గాల పర్యటనలో భాగంగా ఇక్కడకు రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె వి ఆర్ రమేష్, ఐసి డి ఎస్ సిడిపిఓ ఎమ్. పూర్ణిమ పాల్గొన్నారు.

## నిరుపేద వృద్ధుల ఆశ్రమం ప్రారంభం

**కలిదిండి,మేజర్ న్యూస్,** నిరుపేద వృద్ధులను ఆదుకోవడం నిజమైన మానవత్వం అని అగ్నికుల క్షత్రియ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. కలిదిండి మండలం పెదలంక పంచాయతీ పరిధిలో శివ దుర్గ సేవా ట్రస్ట్ పంతగాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న నిరుపేద వృద్ధుల ఆశ్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో నిరాదానికి గురైన వృద్ధులను ఆదుకోవడం చాలా అభినందించదగ్గ విషయమనితెలిపారు. శివ దుర్గ సేవా ట్రస్ట్ మరిన్ని మంచి కార్యక్రమాలు చేసి ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వర రావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ అయినాల బ్రహ్మజీ, జాన్ మంగాచార్యులు,దుగ్గిరాల శామ్యూల్,దుగ్గిరాల పరమేశ్వరరావు, కోకా రాజు వాతాడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఓ డేవిడ్ రాజుకు ఎమ్మెల్యే నాయకర్ నివాళులు

**నరసాపురం,మేజర్ న్యూస్ :** మండలంలోని తూర్పుతాళ్లు విఆర్ఓగా పనిచేస్తున్న పల్లి కొండ డేవిడ్ రాజు విధి నిర్వ హణలో ఉండగా గుండె పోటుతో మృతి చెందారు. బుధవారం మొగల్తూర్ లోని డేవిడ్ రాజు స్వగృహంలో ఆయన భౌతికయానికి ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జన సైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కాళీపట్నం భూములపై జేసి విచారణ

**భీమవరం,మేజర్ న్యూస్:** జిల్లా కలెక్టరేట్ జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్లో మొగల్తూరు మండలం కాళీపట్నం జమీందారి భూములు రద్దు చట్టం అనుసరించి కాళీపట్నం భూముల యజమానులకు రైతు వారి పట్టాలు మంజూరు కొరకు 20 మంది రైతులకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్, సెటిల్మెంట్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. ఈ విచారణ సమావేశంలో సంబంధిత అధికారులు భూమి యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంబంధిత భూ యజమానులు వారి వద్ద ఉన్న హక్కు పత్రాలు దాఖలు చేయాలని,వారికి సంక్రమించిన హక్కు పత్రం రుజువు,ఎంజాయ్మెంట్ దరిమెల రైతు వారి పట్టాలు మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ విచారణ సమావేశంలో కలెక్టరేట్ ల్యాండ్ సూపర్డెంట్ సిహెచ్ రవికుమార్, మొగల్తూరు తాసిల్దార్ రాజ్ కిషోర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

**నరసాపురం,మేజర్‌న్యూస్ :** ఆలిండియా వీవర్స్ పెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విప్ బొమ్మిడి నాయకర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్ కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ సంయుక్త కార్యదర్శి అలంక నాగేశ్వర రావు, నరసాపురం కర్ణ భక్తుల సంఘం అధ్యక్షులు సమతం వెంకటేశ్వరరావు,ట్రెజరర్ సమతం శివప్రసాద్,డాక్టర్ లైసెట్టి రాజేంద్ర ప్రసాద్,ఆకాశపు వేణు, బాసిన కోటి, మావూరి ఆనం ద్, ఉటుకురి చంటి, జిలగం వెంకట సత్యనారాయణ, తుతిక శ్రీనివాసరావు,నక్కినహరి,నల్లవెంకట్రావు,తిప్ప శ్యాంప్రసాద్, కటకం కామేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు వ్యాపించే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

**పెదవేగి ,మేజర్ న్యూస్ :** పశువులకు వ్యాపించే వ్యాధులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పెదవేగి మండలం పశు వైద్యాధికారులు తారకేశ్వర రావు, ఫౌజియా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిలో భాగంగా పెదవేగి మండలంలో పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పశువులకు వ్యాపించే వ్యాధులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐటీడీఏ పీవో శ్రీరాములు నాయక్ అన్నారు.మండలంలోని కోట రామచంద్ర పురం ఐటీడీఏ వద్ద బుధవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. గిరిజనుల నుండి ఐటీడీఏ పీవో శ్రీరాములు నాయక్ వినతి పత్రాలు స్వీకరించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా తమకు రావలసిన నగదు తమకు ఇప్పించాలని కోరుతూ కుకునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన గిరిజనులు వినతి పత్రాన్ని అందజేశారు.

## పిఠాపురం పట్టణ వైస్సార్సీపీ అధ్యక్షునిగా రావుల మాధవరావు

**– పార్టీలో కష్టపడే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది**
**– పిఠాపురం వైస్సార్సీపీ ఇన్చార్జ్ వంగా గీతా విశ్వనాథ్**



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** పిఠాపురం పట్టణ వైఎస్ఆర్సిపి అధ్యక్షునిగా రావుల మాధవరావు నియమితులయ్యారని, ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారని పిఠాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇన్చార్జ్ వంగా గీత విశ్వనాథ్ అన్నారు. పిఠాపురం పట్టణ నూతన అధ్యక్షుడిగా నియమితులైన రావుల మాధవరావును స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో పార్టీ శ్రేణుల మధ్య ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ... పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో వైఎస్ఆర్సిపి ఎప్పుడు ముందుంటుందని, ప్రతిపక్షంలో ఉన్నా... ప్రజలకు దగ్గరగా ఉన్న పార్టీ వైస్సార్సీపీ అని అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పలు అనుబంధ సంఘాల విభాగాలు మరియు పదవులను భర్తీ చేయు ప్రక్రియలో భాగంగా పార్టీ పటిష్టతకు పనిచేసి, పార్టీ సిద్ధాంతాలను ఆశయాలను ప్రజలవద్దకు తీసుకువెళ్లి, ప్రజా సమస్యల కోసం పోరాటం చేసే వ్యక్తులను వివిధ పదవుల్లో నియమిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ప్రజల కోసం ప్రజల సమస్యల కోసం పరితపించే నాయకుడు మన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని, పార్టీలోను ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. పట్టణ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రావుల మాధవరావు మాట్లాడుతూ తనను పిఠాపురం పట్టణ పార్టీ అధ్యక్షునిగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, పిఠాపురం నియోజవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ వంగా గీత, కాకినాడ జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కురసాల కన్నబాబు మరియు నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీ నాయకులను కార్యకర్తలను శ్రేణులను కలుపుకుని, పార్టీ ఆశయాలను సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ ఆదేశాలను పాటిస్తూ... ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో రామ శివ లిఖిత జ్ఞాన యజ్ఞం



**అనపర్తి, మేజర్‌న్యూస్ :** సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డి సురేష్ శర్మ ఆధ్వర్యంలో 2500 మంది భక్తులు భక్తిశ్రద్ధలతో రామ శివ లిఖిత జ్ఞాన యజ్ఞంలో పాల్గొన్నారు. శ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం శ్రీ శారదా పీఠం శృంగేరి( కర్ణాటక) వారు నిర్వహించే యజ్ఞంలో నేను సైతం అనే భగవత్ ఆర్తితో అన్న నినాదంతో కుతుకులూరు గ్రామ శివాలయం చైర్మన్ తాడి సత్తిరెడ్డి, చాముండేశ్వరి దంపతులు అనపర్తి గ్రామంలోని సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డి సురేష్ శర్మ నేతృత్వంలో ఈ నామ లిఖిత యజ్ఞానికి శ్రీకారం చుట్టి చుట్టారు. ఈ కార్యక్రమంలో 2500 మంది భక్తులు భక్తిశ్రద్ధలతో వారి స్వహస్తాలతో 540000 సార్లు రామ నామం, శివనామం రాయించినారు. కాగితానికి ఒక వేపున రామా అను నామము శివ అను నామము భక్తులచే రాయబడిది. రామ శివ లిఖిత జ్ఞాన యజ్ఞ పత్రాలకు బుధవారంప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించి స్వామివారిని అలంకరించి ఈ రాసిన పత్రాలను కర్ణాటక పంపించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సతీష్ రామ మోహన్ రావు వి ప్రసాద్ పి రవి హరి తదితరులు పాల్గొన్నారు.

## సబ్బెళ్ళ కృష్ణారెడ్డిని పరామర్శించిన పలువురు ప్రముఖులు



**అనపర్తి, మేజర్ న్యూస్ :** మాతృ వియోగంతో బాధపడుతున్న అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి సోదరులను బుధవారం అనపర్తి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే డా.సత్తి సూర్యనారాయణ రెడ్డి దంపతులు ఇతర పలువురు ప్రముఖులు పరామర్శించి వీరి మాతృమూర్తి బాపాయమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, కృష్ణారెడ్డికుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పెదపూడి మండల జిల్లాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యురాలు వేపకాయల వెంకటలక్ష్మి రమణ, అనపర్తి మాజీ జడ్పిటిసి కర్రి ధర్మారెడ్డి, ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు తాడి రామగుర్రెడ్డి, పుట్టకొండ సర్పంచ్ వల్లువెంకటరమణ, అనపర్తి సర్పంచ్ వారా కుమారి, ఇల్లపల్లి సర్పంచ్ లొల్లబద్రం, రంగాపురం సర్పంచ్ భద్రం, పెద్దాడ సర్పంచ్ లోకబుర్ర మీనాక్షి కృష్ణ,మారేడుబాక ఎంపీటీసీ పసలపూడి శ్రీనివాసరావు, వైఎస్ఆర్సిపి నాయకులు మండ రాజారెడ్డి, సబ్బెళ్ళ మోహన్ రెడ్డి, కోనాల సాయి రామారెడ్డిపైన పిఎసిసిఎస్ అధ్యక్షులు అమ్మిరెడ్డి లతో పాటు పలువురు ప్రముఖులు పరామర్శించారు.

## డీ.ఎస్.సి అభ్యర్థులకు అనుభవజ్ఞులచే శిక్షణ : మంత్రి రామానాయుడు

**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే డీ ఎస్సిలో మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే డీఎస్సీ ఉచిత కోచింగ్ కు శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులతో పాలకొల్లు లైన్స్ కమ్యూనిటీ హాల్లో ఆయన సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మంత్రి రామా నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే అంటే కేవలం ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే కాదని ప్రజల్లో సామాజిక సేవచైతన్య కార్యక్రమాలు తీసుకువెళ్లాల న్నారు. మొదట పాలకొల్లు నియోజక వర్గంలో సుమారు వంద నుంచి 150 మంది వరకు ఉంటారని భావించిన దరఖాస్తులు మాత్రం 600 నుంచి 700 వరకు వచ్చాయని మంత్రి తెలిపారు. అయినప్పటికీ తాను చేసే కార్యక్రమాలపై విశ్వసనీయత ఉండడం వల్లనే పెద్ద సంఖ్యలో శిక్షణకు ముందుకు వచ్చారని అందుకు అనుగుణంగానే ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిక్షణకు సంబంధించి అవనిగడ్డకు చెందిన కోచింగ్ సెంటర్ నుంచి స్టడీ మెటీరియల్‌ను అందిస్తామని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతనికి మీరంతా ముందుకు వచ్చినం దుకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో ఉచిత శిక్షణ కమిటీ ప్రిన్సిపల్ సిహెచ్ఎస్ నాగలింగేశ్వరరావు, కన్వీనర్ దీప్తి అప్పారావు, కోఆర్డినేటర్ యు బంగారు బాబు, బొక్కా రమాకా ంత్, రావూరి విజయ్‌కుమార్,గండేటి వెంకటేశ్వర రావు,పెచ్చెట్టి బాబు, బిహనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

## డా.కేకేఆర్‌హ్యాపీ వ్యాలీ సందర్శించిన శాంతబయోటెక్ చైర్మన్

**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** మండల పరిధి చొప్పరమెట్ల గ్రామ శివారు తాడేపల్లిలో గల డా.కేకేఆర్ హ్యాపీ వాలీ స్కూల్‌ను పద్మభూషణ్ గ్రహీత శాంతబయోటిక్ చైర్మన్ డా' వరప్రసాద్ రెడ్డి బుధవారం సంద ర్శి ంచారు.ఈ కార్యక్ర మంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో నెలకొల్పిన తెలుగు తల్లి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. తదననంతరం విద్యార్థులంతా కలిసి మా తెలుగు తల్లికి మల్లెపూదండ అనే గేయాన్ని ఆలపించారు. డాక్టర్ కేకేఆర్ పాఠశాల ఉచిత విద్య ప్రోగ్రాంలో విద్య అభ్యసిస్తున్న ప్రతిభా విద్యార్థులను ఉద్దేశించి డా'రెడ్డి మాట్లాడుతూ నేటి పరిస్థితులలో విద్యార్థులకు చదువులలో సంస్కారం లోపిస్తుందని, నేటి పరిస్థితులలో చదువులతో పాటు నైతిక విలువలు, సంస్కారంతో పాటు కృతజ్ఞతా భావం కలిగి ఉండాలని, కృషితో నాస్తి దుర్భిక్షమ్ అని విద్యార్థులకు ఉద్బోధ చేశారు.ఈ కార్యక్ర మంలో హ్యాపీ వ్యాలీ పాఠశాల అధినేత కొసరాజు కోటేశ్వర రావు,డైరెక్ట్ ఆనంద్ కుమార్, డీన్ రఘురాం, ప్రిన్సిపల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ చెందిన ఉపాధ్యాయులు సంతోషంగా జీవించాలి

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఎంతోమంది విద్యార్థులను బావిభారత పౌరులుగా తీర్చిదిద్ది పదవీ విరమణ చెందిన ఉపాధ్యాయులు మంచి ఆరోగ్యంతో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని. నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఏ.భాను ప్రతాప్ అన్నారు. బుధవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ చాంబర్లో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్స్‌లో పనిచేస్తు రిటైర్మెంట్ అయినా ఉపాధ్యాయులు 8 మందికి,అనారోగ్య కారణాలతో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ఒకరికి,మరణించిన ఒకరి కుటుంబ సభ్యులకు వారికి చెల్లించవలసిన ప్రావిడెంట్ డబ్బులను మొత్తం 10 మందికి చెక్కులు రూపేనా 39 లక్షల 28 వేల రూపాయలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిష నర్ జి.చంద్రయ్య,మేనేజర్ మూర్తి, అకౌంటెంట్ లింగేశ్వరి ఉపాధ్యాయసంఘంనాయకులుఎస్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షలు

**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** దేశ వ్యాప్తంగా ఉన్న జాతీయ సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశాలకు గానూ నిర్వహించే ప్రవేశ పరీక్ష జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష బుధవారం ప్రారంభమయింది. పరీక్ష కోసం బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం సాయంత్రం రెండు పూటల పరీక్ష నిర్వహించగా ఉదయం జరిగిన పరీక్షకు 219 మందికి 217 మంది, సాయంత్రం జరిగిన పరీక్షకు 221 మందికి గానూ 220 మంది పరీక్షకు హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మరియు చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నాకరరావు తెలిపారు. మెయిన్స్ పరీక్షలు ఈ నెల 30 వరకు జరగనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్ మరియు టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పరీక్షా నిర్వహణను పర్యవేక్షించారు.

## కేంద్ర ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** గుర్తింపు పొందిన రాజకీయ పార్టీగా ఆవిర్భవించిన జనసేన దశాబ్ద కాల జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పోరాటానికి,గడచిన ఎన్నికల్లో సాధించిన చారిత్రక విజయంతో చరిత్ర సృష్టించిందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జనసేన పార్టీకి గాజు గ్లాస్ గుర్తును శాశ్వత చిహ్నంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ఎన్నికల సంఘానికి బొలిశెట్టి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, అడపా ప్రసాద్, యాంత్రపాటి రాజు, మైలవరపు రాజేంద్రప్రసాద్, పాలూరి వెంకటేశ్వరరావు, పైబోయిన వెంకటరామయ్య, బయనపాలేపు ముఖేశ్ తదితరులు ఉన్నారు.

## వైసిపి నేత కుటుంబానికి మహిళా నేత పరామర్శ

**యలమంచిలి,మేజర్ న్యూస్ :** మండలంలో కొంతేరు గ్రామం వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు,మాజీ సొసైటీ ప్రెసిడెంట్ జక్కంశెట్టి సుభాష్ చంద్రబోస్ ఇటీవలి స్వర్గస్తులయ్యారు. వారి కుటుంబ సభ్యులను కలిసి బుధవారం పరామర్శించి, నివాళ్లు అర్పించిన న్యాయ వాది వైఎస్ఆర్ సీపీ మహిళా విభాగం స్టేట్ జాయింట్ సెక్రెటరీ కర్రా జయ సరిత. తదితరులు,పాల్గొన్నారు.

## రీసర్వేపై అవగాహన కలిగి ఉండాలి : జేసి రాహుల్ కుమార్

**ఇరగవరం,మేజర్ న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవిన్యూ రీసర్వేపై అవగాహన కలిగి ఉండాలని భీమవరం జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొదలాడలోఏర్పాటు చేసిన రీసర్వే పైలెట్ కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో జరిగే రిసర్వే సమాచారం ఎప్పటికప్పుడు రైతులకు ముందస్తు నోటీసులు ద్వారా తెలియజేయాలని చెప్పారు రిసర్వేను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.సర్వే రైతులు సమైక్షంలో చేయడం వలన ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించడానికి విలవుతుందని చెప్పారు.రిసర్వే సదస్సులో ఎర్రయిచెర్వు గ్రామంలో వచ్చిన పంటబొదే తగాదాన్ని పరిష్కరించడానికి రైతులు సహకారంతో సుమారు కిలోమీటర్ దూరం పంటబొదే జె సి బి సాయంతో పునః నిర్మాణం చేసినట్లు మండల తాహిసీల్దార్ యమ్. సుందర్రాజుచెప్పారు.ఇరగవరం గ్రామంలో సర్వే నంబర్ 406 గ్రామ ఖంఠం అయ్యి ఉండగా దానిలో 70సెంట్లు భూమి వాక్స్ బోర్డుదై ఉందని చెప్పారు.ఈ భూమి నిషేధిత భూమి జాబితాలో చేర్చినట్లు చెప్పారు దీనిని క్రయ విక్రయాలు చేయడానికి వీలు లేదని తెలిపారు.ఇంకా మండలం రెవిన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులు త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు.కార్యక్రమంలో ఆర్.డి. ఓ కౌసర్ బానో, డిప్యూటీ తాహిసీల్దార్ బి.మాలతి, రిసర్వే డిప్యూటీ తాహిసీల్దార్ వి. పోతురాజు,మండల సర్వేయర్ నున్న ప్రియాంక, గ్రామ సర్వేయర్ అక్షయ్, వి.ఆర్.ఓలు, పంచాయతీ సిబ్బంది, వి.ఆర్.ఏలు,గ్రామ రైతులు పాల్గొన్నారు.